ప్రజాశక్తి
శుక్రవారం 14 మార్చి 2025 5
శ్రీ సత్యసాయి





పది పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహిద్దాం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌వో విజయ సారధి, డిఈవో క్రిష్టప్ప జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు పది పబ్లిక్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్లు అనుమతించకూడదని కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. జిరాక్స్, నెట్ సెంటర్లు మూసి వేయించాలని ఆదేశించారు. ఈ ఏడాది 23,730 మంది విద్యార్థులు జిల్లాలో పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. వీరిలో 22,295 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 1435 మంది ప్రయివేటు విద్యార్థులు ఉన్నారన్నారు. జిల్లాలో మొత్తం 104 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 9:30 గంటల నుంచి 12:45 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. .జిల్లాలో ఆరు సమస్యాత్మక పరీక్ష కేంద్రాలు గుర్తించామని, అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామని పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, సరిపడా లైటింగ్, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు.

స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమాలు విజయవంతం చేయాలి

పరిశ్రమల యాజమాన్యాలు ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టే క్రమంలో సిఎస్ఆర్ నిధులు ఖర్చు చేసి సమాజంపై మెరుగైన ప్రభావం చూపించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ కోరారు. గురువారం కలెక్టరేట్లో పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులతో సిఎస్ఆర్ నిధులు వినియోగం ఇప్పటివరకు పూర్తి కాబడిన పనుల వివరాలపై కలెక్టర్ సమీక్షించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర వివిధ కంపెనీల భాగస్వామ్యంతో కార్యక్రమాలు విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. వినియోగానికి సంబంధించి వివరాలు అన్నీ ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ పరిశ్రమల మరమ్మత్తులు, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కంపెనీలలో భద్రత జాగ్రత్తలు పాటించాలని మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారా లేదా ధ్రువీకరించుకోవాలని ఇన్స్‌పెక్టర్ ఫ్యాక్టరీస్ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్ కుమార్, పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, డిపిఓ సమత, ఇతర కంపెనీల అధికారులు పాల్గొన్నారు.





◆ రెండు వారాల్లో 50 శాతం తగ్గుదల
◆ అరటి రైతుకు మరోసారి క(న)ష్టం..!
◆ గిట్టుబాటు ధరకై రైతుల్లో ఆందోళన

అరటి ధర పతనం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గత నెలలోనే జిల్లాలో హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహించి ఉద్యానవన రైతుకు ఊతమిస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున ప్రకటనలు చేశారు. అదే సమయంలో అరటిని విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా మంచి ధర రైతుకు దక్కుతున్నట్టు కూడా ఉపన్యాసాలు ఇచ్చారు. సరిగ్గా నెల తిరిగిలోపు అరటి ధరలు నేల చూపులు చూస్తున్నాయి. ఈ 15 రోజుల్లోనే అరటి ధర సగానికిపైగా పడిపోయింది. కొనుగోలు దారులు కోసం రైతులు ఎదురుచూపులు చూసే పరిస్థితి నెలకొంది. జిల్లాలో సుమారు ఒకటిన్నర లక్షల హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగయితే అందులో 30 వేల హెక్టార్ల వరకు అరటి పంట ఉంటుంది. ఏడాదికి సుమారు 65 మిలియన్ టన్నుల దిగుబడి అరటి వస్తుంది.

15 రోజుల్లో సగం ధర పతనం

అరటి పంట చేతికొస్తున్న సమయంలో ధరలు ఆమాంతంగా పడిపోతున్నాయి. 15 రోజుల ముందు వరకు బాక్సు రకం అరటి అంటే ఎగుమతి రకం పంట టన్ను రూ.25 వేల వరకు పలికింది. అటువంటిది ఇప్పడు రూ.10 వేల నుంచి రూ.15 వేలలోపు పడిపోయింది. దానికి కూడా కొనేవారు లేకపోవడంతో రైతులు పంటను ఏ రకంగా అమ్ముకోవాలో పాలుపోని పరిస్థితుల్లో ఉన్నారు. వ్యాపారులేమో బయట డిమాండ్ లేదంటూ ధరను ఆమాంతంగా కిందకు దించేస్తున్నారు. రైతులేమో ఎకరానికి రూ.1.50 లక్షల పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేస్తే ఇప్పుడు ధర తగ్గి నష్టపోయే పరిస్థితులు నెలకొనడంతో ఆందోళన చెందుతున్నారు.

ధర రోజురోజుకు తగ్గిపోతోంది


లక్షలు ఖర్చు పెట్టి మూడు ఎకరాల్లో అరటి పంటను చేశాం. ఈ ఏడాది ప్రకృతి అనుకూలించడం దిగుబడులు బాగా వచ్చాయి. ధర కూడా 15 రోజుల ముందుకు బాగుండటంతో ఈసారి సమస్యల నుంచి గట్టెక్కుతామని ఆశించాం. తీరా కోత దశకు వచ్చేసరికి చూస్తే ధర ఆమాంతంగా తగ్గిపోయింది. రూ.12 వేలకు టన్ను కూడా అడిగేవారు లేరు.

కేశవ, అరటి రైతు.

రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రకటనలు చేస్తోంది. ఇటీవలే జిల్లాలో పెద్దఎత్తున ఉద్యావన సదస్సును అధికారులు నిర్వహించారు. అందులోనూ రైతుకు గిట్టుబాటు అందిస్తామని అందరూ చెప్పారు. ఆచరణలో అమలు జరగడంలేదు. ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి పంటలు సాగు చేస్తే రైతుకు గిట్టుబాటు ధర మాత్రం లభించడం లేదు. ప్రభుత్వం అరటి రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

శివారెడ్డి,
ఎపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి.



కవయిత్రి కుమ్మరి మొల్ల జయంతి సభలో పాల్గొన్న అధికారులు

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం మొట్టమొదటి తెలుగు కవయిత్రి కుమ్మరి మొల్ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ నరేంద్రకుమార్, ఎంపిపి ప్రమీల ఆధ్వర్యంలో మొల్ల చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ కవయిత్రి మొల్ల రాసిన వ్యాసాలను తెలిపారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు నవీన్, సతీష్, గ్రామ కార్యదర్శులు శంకర్, మస్తాన్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఓంకార్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలతో పాటు మండలం లోని పాపిరెడ్డిపల్లి కెజిబివిలో దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తుందని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్ర, కెజిబివి ఎస్ఒ అనిత, సూపర్వైజర్ రవీంద్ర, ఎఎన్ఎం లక్ష్మీదేవి, గంగమ్మ, ఆశా కార్యకర్తలు నాగరత్న, అశ్వత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి. హరి పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు చాలా ప్రధానమైనవని, వీటిని ధైర్యంగా ఎదుర్కొని మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రంగనగోపాల్, పూజారి జగదీష్, గట్టు మహేంద్ర, అంత్రాల మనోహర్ పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని దొడగట్ట జడ్పీ హైస్కూల్‌లో గురువారం హెచ్‌ఎం సుజాత ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని మొక్కుకున్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేశారు.

రద్దీ ప్రాంతాల్లో సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-సోమందేపల్లి

దాతల సహకారంతో సోమందేపల్లిలోని రద్దీ ప్రాంతాల్లో సోలార్ బేస్డ్ లింక్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్ఐ మాట్లాడుతూ తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి హరి 5, కియా అనుబంధ సంస్థ ఎస్‌విబి ఇన్‌ఫ్రా కంపెనీ 3, కెవిఎస్ కంపెనీ 3 కెమెరాలు ఉచితంగా అందించారన్నారు. సోలార్ బేస్డ్ లింక్ కెమెరాలను రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం వల్ల చోరీలు, గొడవలు, తదితర అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. మండలంలోని ప్రజలు స్వచ్ఛంధంగా లేదా గ్రూపుగా ఏర్పడి వారి వారి ప్రాంతాల్లో ఇలాంటి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్‌బాబు

శ్రావణి సీడ్స్ లైసెన్స్ రద్దు చేయాలి : రైతుసంఘం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నాసిరకం కలింగర విత్తనాలు విక్రయించి రైతుకు లక్షలాది రూపాయలు నష్టం చేకూర్చిన అనంతపురం శ్రావణి సీడ్స్ లైసెన్స్‌ను రద్దు చేయాలని, నష్టపోయిన రైతు మురళి కుటుంబాన్ని ఆదుకోవాలని ఎపి రైతు సంఘం నాయకులు కోరారు. నాసిరకం విత్తనాలతో పంట నష్టపోవ డంతో శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం, డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన రైతు మురళి అనంతపురంలో మంగళవారం ఆత్మహత్యకు యత్నిం చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత రైతును రైతు సంఘం నాయకులు కలిసి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం రైతును ఆదుకో వాలని కోరుతూ వ్యవసాయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు మాట్లాడు తూ శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం, డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన రైతు మురళి అనంతపురం నగరంలోని శ్రావణి సీడ్స్ దుకాణంలో బిఎస్ ఎఫ్ మ్యాక్స్ కంపెనీ కలింగర విత్తనాలు తీసుకుని పంట సాగు చేశా న్నారు. పంట కాలానికి కాయ రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి లో రైతు శ్రావణి సీడ్స్‌షాపు యజమానులను కలిసి ఇచ్చిన కలింగర విత్తనా లు నాసిరకంగా ఉన్నాయని, రూ. 6.90 లక్షల పెట్టుబడి పెట్టి నష్టపో యానని ఆవేదన వ్యక్తం చేశాడన్నారు. ఈ సమయంలో సీడ్స్ యాజమా న్యం అవమానరకంగా మాట్లాడటంతో న్యాయం జరగలేదని భావించిన రైతు షాపు ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్ప డ్డాని తెలిపారు. అధికారులు స్పందించి నాసిరకం విత్తనాలు విక్రయించిన శ్రావణి సీడ్స్ దుకాణం లైసెన్స్ రద్దు చేయాలన్నారు. నష్టపోయిన రైతు మురళికి నష్టపరిహారం అందించి, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.



ధర్మవరంలో ఎడి కిష్టప్పకు వినతి పత్రం ఇస్తున్న ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న తదితరులు

బాధిత రైతుకు న్యాయం చేయాలి

ధర్మవరం రూరల్ : నకిలీ విత్తనాల వల్ల మోసపోయి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిన రైతుకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక నాయకులు ఆలకుంట మారుతీ, వెంకటేష్, ఆదినారాయణతో కలసి గురువారం ధర్మవరం వ్యవసాయ కార్యాలయం లో ఎడి కిష్టప్పకు వినతి పత్రం అందజేశారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని విత్తనాలు ఇచ్చిన దుకాణాన్ని సీజ్ చేయాలని కోరారు.

విద్యతోనే సమాజాభివృద్ధి : మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

విద్య ద్వారానే సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ ఛైర్మన్ డి.ఈ రమేష్‌కుమార్ సూచించారు. పట్టణంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మున్సి పల్ ఓరియంటల్ హైస్కూల్‌లో గురువారం హెచ్‌ఎం పెన్నహోమిలం అధ్యక్షతన సరస్వతి పూజ, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల జీవితంలో ఎంతో ముఖ్యమైంద న్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యార్థులు చదివి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. విద్య నేర్చుకోవడం వల్ల సమాజంలో ప్రత్యేక గౌరవ ప్రతిష్టలు దక్కుతాయన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలకోర్చి పిల్లలను చదివిస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ షేక్ మాలిన, వైస్ ఛైర్మన్ మురళీధర్, అసిస్టెంట్ హెచ్‌ఎం రామిరెడ్డి, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళలు ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని టిడిపి నాయకులు తెలిపారు. పట్టణం లోని టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు మిషన్లు పంపిణీ చేస్తారన్నారు. అర్హులు సంబంధిత సచివాలయాల్లో వెల్ఫేర్ ఆఫీసర్, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఓసీ మహిళలు కూడా అర్హులన్నారు. సమావేశంలో నాయకులు శ్రీరాములు, నాగులూరు, నారాయణస్వామి, రమణమ్మ, గార్మెంట్స్ రవి, సిద్దయ్య, శ్రీనివాసులు, గుట్టూరు సూర్యనారాయణ, హనుమంతు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, కురుబ నంజుండ, బాబిరెడ్డి, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, లక్ష్మీదేవమ్మ, సోము, చెంద్రాయుడు, చంద్రకాంతమ్మ, నారాయణనాయక్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

హనుమద్ వాహనంపై శ్రీవారు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం హనుమద్ వాహనంపై ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి తిరువీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేక పూజ కార్యక్రమాలు అలంకరణలు పూర్తి చేశారు. అనంతరం స్వామివారికి హనుమంతు వాహనంపై ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన సంగీత విద్వాంసులను పిలిపించి ప్రత్యేక కచేరీలు ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారి ఉభయ దారులుగా మాజీ ఎమ్మెల్యే రామయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి, ఆర్డీవో వివిఎస్.శర్మ, పట్టణ సిఐ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



హనుమద్ వాహనంలో ఊరేగుతున్న శ్రీవారు



పురంలో ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ముగిసిన ఫస్ట్ ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు గురువారం ఇంటర్మీడియట్ బోర్డు కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ రవినాయక్ పట్టణంలోని నారాయణ, సప్తగిరి, బాలాజీ, బాలయేసు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జరిగిన పరీక్షకు సెట్ నెంబర్ -2 ప్రశ్నపత్రాలను ఉపయోగించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘునాథ్‌రెడ్డి తెలి పారు. 11,766 మంది జనరల్ విద్యార్థులకు గానూ 11,388 మంది హాజరు కాగా 378 గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థుల్లో 1,156 మందికి గానూ 1,068 మంది హాజరు కాగా 88 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద 12,922 మందికి గానూ 12,456 మంది హాజరు కాగా 466 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలను జిల్లా పరీక్షల స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవప్రసాద్, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు సురేష్‌బాబు, రామరాజు, శ్రీనివాసరెడ్డి, డిస్ట్రిక్ట్ బల్క్ ఇన్‌ఛార్జి శ్రీవెంకటేశ్వర ప్రసాద్ పర్యవేక్షించారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాతంగా ముగిశాయన్నారు. పరీక్షలు పూర్తవడంతో జూనియర్ ఇంటర్ విద్యార్థులు పరీక్ష కేంద్రం నుంచి కేరింతలు కొడుతూ బయటకు వచ్చి స్నేహితులతో కలిసి ఆనందం పంచు కున్నారు

'భాష్యం'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని భాష్యం పాఠశాలలో గురువారం ప్రిన్సిపల్ సల్మా అధ్యక్షతన యుకెజి పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్నిఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ మహేష్, విశిష్ట అతిథిగా అఖిల భారత టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ ఛైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబుద్ధులు, విద్యతో పాటు విలువలు నేర్పించాలని సూచించారు. చిన్నప్పటి నుంచి మానవతా విలువలు నేర్పించడం వల్ల వారు భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడేలా ఉన్నతంగా జీవిస్తారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహంగా ఉంటూ సెల్‌ఫోన్ వాడటం వల్ల కలిగే అనర్థాలను వారికి సమగ్రంగా వివరించాలన్నారు. పిల్లలను విద్యతో పాటు ఆట పాటల్లోనూ భాగస్వామ్యం చేయాలన్నారు. అనంతరం డీఎస్పీ విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో డీఎస్పీ మహేష్

ఎంజెపి విద్యార్థులతో పనులు..!

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక మహాత్మజ్యోతిబాపూలే(ఎంజెపి) గురుకుల పాఠశాల విద్యార్థుల చేత పనులు చేయిం చడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతున్న దృష్ట్యా గురువారం ఎంజెపి పాఠశాల నుంచి రొద్దంలో ఉన్న పరీక్ష కేంద్రానికి బల్లలు తరలించారు. అయితే వాటిని కూలిల చేత కాకుండా 9వ తరగతి విద్యార్థుల చేత ట్రాక్టర్‌లో ఎత్తడం, దించడం, నిచ్చెన మోయిం చడం వంటి పనులు చేయించారు. దీనికి తోడు గత శనివారం పాఠశాలకు వచ్చిన సరుకుల బస్తాల (దాదాపు 50 కిలోల బరువు)ను విద్యార్థుల చేత వాహనంలో నుంచి కిందకు దింపించారు. ఈ విషయం ఆలస్యం గా వెలుగులోకి వచ్చింది. ఇవన్నీ గమనించిన విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను చదువుకునేం దుకు పాఠశాలకు పంపగా ఉపాధ్యా యులు ఇలా పనులు చేయించడం ఏంటని మండిపడుతున్నారు. బస్తాలు, బల్లలు ట్రాక్టర్‌లోకి ఎత్తేటప్పుడు, దింపేట ప్పుడు విద్యార్థులకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పిల్లల చేత ఇలాంటి పనులు చేయించ కుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బస్తాలు మోస్తున్న విద్యార్థులు



బల్లలు తీసుకెళ్తున్న విద్యార్థులు

బాల్యవివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - తలుపుల

స్థానిక జీవనజ్యోతి మండల సమైక్యలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సిడిపిఒ రాధిక మత పెద్దలతో సమావేశం నిర్వహించి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం మెయిన్ బజార్ మీదుగా స్థానిక బస్టాండ్ కు ర్యాలీగా చేరుకొని అనంతరం స్థానిక మూడు రోడ్ల కూడలిలో ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రెడ్డి శేఖర్, ఎంపీడీవో రమానాయక్, మండల విద్యాధికారి వెంకట రాముడు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిహారిక, దీప, ప్రభుత్వ వైద్యులు అల్తాఫ్, ఎఎస్ఐ కృష్ణారెడ్డి, ఎపిఎం బాబ్జి, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8తేది మంగళగిరి లో జరిగిన మహిళ సదస్సు లో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన సంకారపు జయశ్రీ ని ఆంధ్రప్రదేశ్ బి సి మహిళ అధ్యక్షురాలిగా సభ్యులు ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ధర్మవరం మండల బి సి నాయకులు జయశ్రీని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెల్లం తిరుపాల్, సత్యమన్న,కొండన్న, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లి గ్రామంలోని ఆర్డీటీ పాఠశాలకు ఎస్ఐ కృష్ణమూర్తి చేతుల మీదుగా ఫ్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం డీఎస్పీ విజయకుమార్ ఆధ్వర్యంలో పల్లె నిద్ర నిర్వహించగా పలు సమస్యలను పోలీసులు అడిగి తెలుసుకున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల పలు సమస్యలను విన్నవించారన్నారు. స్థానిక ఆర్డీటీ పాఠశాలకు ఫ్యాన్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారన్నారు. స్పందించిన డీఎస్పీ చేతుల మీద గ్రామస్తులకు ఫ్యాన్లు అందజేశారు.

పక్కాగా పి-4 సర్వే

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం వ్యాప్తంగా ఇప్పటికే ప్రారంభమైన పి-4 సర్వేను (పబ్లిక్, ప్రయివేట్, పీపుల్ పార్టనర్షిప్) పక్కాగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం తన చాంబర్ లో సర్వేకు సంబంధించిన పోస్టర్‌ను సిబ్బందితో కలిసి విడుదల చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్వేను సర్వేను పూర్తి చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఈ మోహన్, టెక్నికల్ అధికారి బండి ఆనంద్ రాజు, జూనియర్ అకౌంట్స్ అధికారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ కమల్ రోహిత్ పేర్కొన్నారు. మండలంలోని గౌరపురం గ్రామంలో ప్రజలకు 104 వైద్య సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి సలహాలు ,సూచనలు ఇచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి వసుంధర, 104 డేటా ఎంట్రీ చంద్ర,ఆరోగ్య కార్యకర్త అశ్విని, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మహిళ అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకొని గురువారం గాండ్లపెంట, నంబులపూలకుంట మండలాలకు చెందిన మహిళ సంఘాల సభ్యులు డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రూరల్ సిఐ నాగేంద్ర మాట్లాడుతూ మహిళలు విద్య ఆర్థిక రాజకీయం సామాజిక రంగాలలో రాణించాలన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే 100.112. నెంబర్లకు వెంటనే కాల్ చేస్తే పోలీసులు రంగ ప్రవేశం చేసి సమస్యను వెంటనే పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ హెడ్‌లీడ్ భక్తర్‌వలి, నాలుగు మండలాల ఎపిఎంలు జయంతి, సూర్యనారాయణ, బావాజీ, వెంకటనారాయణ, ఐసిడిఎస్, పోలీసు సిబ్బంది మహిళా సంఘాలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

మొక్కలు నాటండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా కొండగుట్టలలో ఉపాధి పనుల కోసం తీసిన గుంతలలో మొక్కలు నాటాలని పర్యావరణవేత్త భాస్కర్ నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీ డి విజయప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కొత్తచెరువు గ్రామంలో గల నల్లగుట్ట దాదాపు 200 ఎకరాలు పైచిలుకు భూమి ఉందని ఆ ప్రాంతాన్ని సహజ అడవిగా మార్చుటకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గుట్టలో ఇప్పటికే కరువు పనిక్రింద గోతులు తవ్వి ఉంచారని తవ్విన గుంతలలో మొక్కలు నాటాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గంగాధర్, గోపాల్, మనోహర్, రామమోహన్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న పర్యావరణవేత్తలు

తొలి తెలుగు కవయిత్రి మొల్ల : కలెక్టర్



మొల్ల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

తొలి తెలుగు కవయిత్రి గా మొల్లమాంబ చరిత్రలో నిలిచారని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మొల్లమాంబ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ విజయసారధి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నిర్మల జ్యోతి, శాలివాహన సంఘం నాయకులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొల్లమాంబ జీవిత చరిత్రను వివరించారు. సమాజానికి ఆమె అందించిన సేవలను గుర్తించి ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించడం జరుగుతోందన్నారు. విద్య వల్లనే సమాజ అభివద్ధి సాధ్యమని భవిష్యత్తు తరాలకు కవయిత్రి చాటి చెప్పారన్నారు. విద్యార్థులు ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కొత్తచెరువు, ముదిగుబ్బ కు చెందిన బిసి హాస్టల్ విద్యార్థులు మొల్లమాంబ జీవిత విశేషాలు ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షులు వెంకటనారాయణ, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కవయిత్రి మొల్లజయంతిని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు రాఘవేంద్ర ప్రజాపతి, బిసి నాయకులు జంగమన్న, బెల్లం తిరుపాల్, పెద్దన్న, సత్యమన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నిధులను పక్కదారి పట్టించొద్దు : సిఐటియు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ నిధులను కార్మికుల వేతనాలకు, పరిశ్రమ నడపడానికి మాత్రమే ఖర్చు పెట్టాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు మండల నాయకులు జెవి. రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు టి అయుబ్ ఖాన్ ,ఎల్ ఆదినారాయణ, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు మారుతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం కేటాయించిన బడ్జెట్ కేవలం గతంలో కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల కోసం మాత్రమే అని పేర్కొనడం అన్యాయమన్నారు. పరిశ్రమ నడవాలంటే పాత బకాయిలు చెల్లించడం ఒకటే కాదని, పరిశ్రమలో ఉత్పత్తుల కోసం కష్టపడుతున్న కార్మికుల వేతనాలను కూడా చెల్లించాలనిఅన్నారు. కేవలం పాత బకాయిల కోసమే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడాన్ని బట్టి చూస్తే కార్మికులను, పరిశ్రమను నట్టేట ముంచే ప్రయత్నాన్ని కేంద్రం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు హైదర్ వలి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశ:లో పాల్గొన్న నాయకులు

బాలయేసులో ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని బాల యేసు విద్యాలయంలో గురువారం ముందస్తు హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధ్యక్షులు బలరామిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శారదా మాట్లాడుతూ విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు పండుగల గురించి వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిన్నారుల హోలీ సంబరాలు

కార్మికుల సమస్యలపై 17న చలో విజయవాడ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో కార్మికుల పరిష్కారం కోసం ఈనెల 17వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని శ్రీసత్యసాయి జిల్లా డిపిఒ కార్యాలయంలో ఏవో వంశీకృష్ణ కి వినతి పత్రం అందజేశారు . గ్రామపంచాయతీ లో వివిధ కేటగిరి లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 17వ తేదీ జరిగే ధర్నాకు జిల్లా వ్యాప్తంగా కార్మికులు వెళ్తున్నారని ఏవోకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ఆక్కులప్ప,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్త నిరసనను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వ ప్యాకేజీ విషయంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న వైఖరికి నిరసనగా చేపట్టిన రాష్ట్ర వ్యాప్త నిరసనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షిస్తామని బీజేపీ, టీడీపీ, జనసేనలు ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు వాగ్దానం చేశాయన్నారు. అయితే కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస వర్మ జనవరి 29న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి ప్యాకేజీ ప్రకటించారు. కానీ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులు మాత్రం కేవలం ఉన్న అప్పులు తీర్చడానికి మాత్రమే ఉపయోగించాలని, స్టీల్ ప్లాంట్ కార్మికుల వేతనాలకు గానీ, ముడిసరుకు కొనడానికి గానీ, ప్లాంట్ నడపటానికి కావాల్సిన పరికరాలు కొనడానికి ఉపయోగించరాదని ప్రకటించారన్నారు. కేటాయించిన ప్యాకేజీ ద్వారా ఉన్న అప్పులు తీర్చి ప్రైవేట్ వారికి అప్పులు లేని ప్లాంటు ధారాదత్తం చేయాలనే కుట్ర తప్పు,ప్లాంట్ పునరుద్ధరణకు గానీ, నడపడానికి గానీ కాదని విమర్శించారు. ప్లాంట్ నడవాలంటే కనీసం కార్మికులకు చట్టబద్ధంగా వేతనాలు చెల్లించాలన్నారు. ఉత్పత్తికి కావాల్సిన ముడిసరుకును కొనకుండా ప్లాంట్ నడుస్తుందా అని ప్రశ్నించారు. మోసపూరితంగా ప్యాకేజీ ప్రకటించి రాష్ట్ర ప్రజలను, కార్మికులను మభ్య పెడుతున్నారన్నారు. ప్లాంట్ నడపడానికి అవసరమైన నిధులు కేంద్రం నుండి తీసుకురావాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా మార్చి 14న జిల్లాలో అన్ని ప్రాంతాలలో తీవ్ర నిరసన తెలియజేయాలని ప్రజలకు, ఉద్యోగ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ఈ నిరసనను కార్మిక, కర్షక సంఘాలన్నీ జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధి పనులపై వ్యకాసం పరిశీలన

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కూలీలు చేస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేసవి కాలంలో పని ప్రదేశంలో కనీసం నీటి సదుపాయం లేకపోవడం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా కేవలం ఫారం పాండ్ పనులు మాత్రమే ఉండడంతో కూలీలు పనులు చేయలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు ఉపాధి హామీ కూలీలకు సరైన సౌకర్యాలు కల్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

యోగివేమన రిజర్వాయర్‌కు హంద్రీనీవా నీరందించాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని యోగివేమన రిజర్వాయర్ తో పాటు చెరువులకు హంద్రీనీవా నీరు అందే విధంగా అధికారులు చూడాలని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. ముదిగుబ్బ మండలంలోని హంద్రీనీవా కాలువతో పాటు పలు గ్రామాల్లో చెరువులను శ్రీరామ్ పరిశీలించారు. పాముదుర్తి వద్ద జిలేడు బండ వంక, యోగి వేమన రిజర్వాయర్, ముదిగుబ్బ సమీపంలో హంద్రీనీవా కాలువ టన్నెల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ అధికారులు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు. హంద్రీనీవా కాలువకు లైనింగ్ చేస్తే.. తాము తీవ్రంగా నష్టపోతామని శ్రీరామ్ వద్ద పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. లైనింగ్ వలన రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని శ్రీరామ్ కోరారు. ఈ ప్రాంత రైతులు నష్టపోకుండా కాలువకు తూములు ఏర్పాటు చేసి చెరువులకు నీరందించేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీనిపై హంద్రీనీవా ఎస్ఈతో శ్రీరామ్ మాట్లాడారు. ముదిగుబ్బ మండలంలోని చెరువులు, యోగి వేమన రిజర్వాయర్ కు నీరు అందించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రమేష్ బాబు, మండల కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, , కోట్ల బాబి, వినోద్ బాబు, టిడిపి నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో శ్రమిస్తే విజయం సొంతం



10వ తరగతి విద్యార్థులతో పాంచజన్య శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్య ఛేదన కోసం క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమిస్తే విజయం వారి వెంటే ఉంటుందని పాంచజన్య పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు సూచించారు. మార్చి 17 నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో గురువారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాసులు మాట్లాడుతు విలువలతో కూడిన విద్య వివేకాన్ని పెంచుతుందని, ప్రతి విద్యార్థి వారు ఎంచుకున్న సబ్జెక్టులపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకొని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలన్నారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు తగిన ప్రోత్సహకంతో పాటు ఇంటర్ విధ్యకు ఆర్థిక సహాయం సైతం అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన విద్యా సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నంద కుమార్, హెచ్‌ఎం గాయిత్రి, ఎఒ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎంలు సతీశ్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు కీర్తి ప్రియ, ఫ్రాన్సీనా, మంజుళ, పీడీ ప్రేమ్ కుమార్, కార్తీక్ తో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాంచజన్య శ్రీనివాసులు

విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి - పరిగి

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని అలాంటి విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయగలమని ఎంఇఒ శేషాచలం, హిందూపురం దీప్తి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షాజీ ఏమనుయేల్ పేర్కొన్నారు. గురువారం పరిగి మండల కేంద్రంలోని విశ్వదీప్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆనివల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఇఒ మాట్లాడుతూ ఇలాంటి అనివాల్ డే కార్యక్రమాలు మునుపెన్నడు తను చూడలేదని విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయని అన్నారు. ఈసందర్భంగా దీప్తి పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పరిగి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యరాజ్, అమర్ విద్యా మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇబ్రహీం, విశ్వ దీప్తి పాఠశాల ప్రిన్సిపల్ రవికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ, తదితరులు

వికలాంగ విద్యార్థులకు హైజిన్ కిట్లు అందజేత

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని కోడికొండ చెక్‌పోస్టులో సమర్ధనం ట్రస్ట్ దివ్యాంగుల సంస్థలో వికలాంగ విద్యార్థులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో హైజినిక్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లలో వ్యక్తిగత పరిశుభ్రతకు ఉపయోగకరమైన బట్టల సోప్స్, స్నానపు సోప్స్, కొబ్బరినూనె, టూత్ పేస్ట్, షేవింగ్ కిట్, మహిళలకు సానిటరీ ప్యాడ్స్ ఉంటాయని రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి రోగాల బారిన పడకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సమర్ధనం ట్రస్ట్ సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ రమేష్, రెడ్ క్రాస్ మెంబర్ శ్రీకుమార్ రెడ్డి, మొబిలైజర్ రామాంజి, ప్లేస్మెంట్ అధికారి ఎర్రిస్వామి, ట్రైనర్ కవిత తదితరులు పాల్గొన్నారు.



హైజిన్ కిట్ అందజేస్తున్న దృశ్యం

నేరాలు ఘోరాలు

తాపీమేస్త్రీ ఆత్మహత్య

ప్రజాశక్తి-పెనుకొండ

నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలో గురువారం కుటుంబ కలహాలతో తాపీమేస్త్రీ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తిమ్మాపురం గ్రామానికి చెందిన నంజుండ(33) తాపీమేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగించేవాడు. భార్యాభర్తల మధ్య కలహాల నేపథ్యం లో గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య, ఇద్దరు కుమా రులు ఉన్నారు. మృతుని సోదరుడు ముత్యాలప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని కరావులపల్లితండాలో గురువారం తిప్పేబాయి(48) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. వివరాలు.. సంపులోని నీటిని తోడేందుకు తిప్పేబాయి విద్యుత్ మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ వైరును ముట్టుకోవడంతో షాక్‌కు గురై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో నివాసముంటున్న షేక్షావలి (24) గురువారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, హిందూపురం జీఆర్పి హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు వివరాలు... షేక్షావలి తండ్రి కోళ్ల ఫారం వ్యాపారం చేస్తున్నాడు. షేక్షావలి ఓ లారీ క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబపోషణకు తోడ్పాడునందించేవాడు. అయితే గత నాలుగు సంవత్సరాలుగా షేక్షావలి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతడిని అనంతపురం, బెంగళూరు తదితర హాస్పిటల్లో వైద్య చికిత్సలు అందించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో మద్యానికి బానిస అయిన షేక్షావలి గురువారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హోలీను ప్రశాంతంగా జరుపుకోండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

హోలీ పండుగను జిల్లా ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ వి.రత్న సూచించారు. హోలీ పండుగ సందర్భంగా ఎవరు ఎటువంటి గొడవలు అల్లర్లు సమస్యలు జోలికి వెళ్లకుండ వేడుకలు జరుపుకోవాలన్నారు. జిల్లాలోని ముఖ్యమైన, పట్టణాలు ప్రదేశాలు కాలనీలు రహదారులపై పోలీసుల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్లు కూడా వినియోగిస్తామని తెలియజేశారు .బహిరంగా ప్రదేశాలు లో వ్యక్తులు స్వేచ్ఛకు భంగం కలిగేలా ప్రవర్తించరాదన్నారు. హోలీ పండుగ సందర్భంగా కలుషితమైన, ప్రమాదకరమైన రంగులు వినియోగించవద్దని సూచించారు.

పిఠాపురానికి తరలిన జన సైనికులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

జనసేన పార్టీ ఆవిర్భవ దినోత్సవం పిఠాపురంలో జరగనున్న నేపథ్యంలో పుట్టపర్తి నుంచి ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు. పట్టణంలోని హనుమాన్ సర్కిల్ నుంచి బస్సులో పీఠాపురానికి బయలుదేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంటు సమన్వయకర్త చిలకం మధుసూదన్ రెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గం సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ ఆదేశాలతో శుక్రవారం పిఠాపురంలో జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు పూల శివప్రసాద్, మేకల ఈశ్వర్, మండల అధ్యక్షులు ఆంజనేయులు, రామలింగాద్రి, మల్లికార్జున, కరుణాకర్, హరి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామ, వార్డు సచివాలయ హేతుబద్ధీకరణ ప్రక్రియలో ప్రభుత్వం వికలాంగ ఉద్యోగులకు న్యాయం చేయాలని సంబంధిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ కోరారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ వికలాంగ ఉద్యోగులను మల్టీపర్పస్ ఫంక్షనరీస్ గా పేర్కొనడం వల్ల వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీరికి సర్వేల నుండి తక్షణమే మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పది విద్యార్థులకు ఉచిత బస్సు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పదవ తరగతి పరీక్షలకు హాజరు అయ్యే విద్యార్థులకు ఆర్టీసీ ఉచితం ప్రయాణ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు జిల్లా ఆర్టీసీ రవాణా శాఖ అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పల్లె వెలుగు బస్సులలో తమ హాల్ టికెట్లు చూపించి గ్రామం నుంచి పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ఈనెల 17 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు పరీక్ష తేదీలలో మాత్రమే అనుమతించబడుతుందని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లడానికి తిరిగి రావడానికి అనుమతి ఉంటుందని హాల్ టికెట్‌ను కండక్టర్‌కు చూపించాలని సూచించారు. విద్యార్థులు పరీక్షలకు తగిన సమయాన్ని ప్రణాళిక బద్ధంగా కేటాయించుకొని ఎలాంటి గందరగోళానికి గురి కాకుండా, తోటి ప్రయాణికులకు ఇబ్బందులకు కలుగనీయకుండా సహకరించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని ఈ సౌకర్యాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

భూమి కలిగిన ప్రతి రైతూ ఆ గ్రామానికి సంబంధించిన రైతు సేవ కేంద్రంలో విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం తమ వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఇలియాస్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూఈ విశిష్ట గుర్తింపు సంఖ్య అర్హులైన భూమి కలిగిన రైతులను గుర్తించడంలో తోడ్పడి, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలు, రాయితీలు వర్తిస్తాయన్నారు. రైతులు ఆధార్ కార్డు, ఆధార్ అనుసంధానిత మొబైల్ ఫోన్, పట్టాదారు పాసుపుస్తకం తీసుకొని గ్రామంలోని రైతు సేవా సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో మండల పరిధిలోనిఓ డి.చెరువు, కొండకమర్ల, మిట్టపల్లి, గౌనిపల్లి పాఠశాలలకు చెందిన పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈనాలుగు పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 286 మంది విద్యార్థినీ విద్యార్థులకు దాత వెంకట సాయి, ఐటిఐ విద్యా అధినేత సుధాకర్ సహకారంతో ఎగ్జామ్ కిట్లను పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకట సాయి ఐ.టి.ఐ ప్రిన్సిపాల్ ఆంజనేయులు , ట్రస్టు ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయక్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం హరినాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రమోహన్, గోపీనాథ్,మహేశ్వర్ రెడ్డి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.



పరీక్షసామగ్రి అందజేస్తున్న దృశ్యం

పంటను పరిశీలించిన అధికారులు

బత్తలపల్లి : నకిలీ విత్తనాలతో మోసపోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతుకు సంబంధించిన కళింగర పంటపొలాన్ని హార్టికల్చర్, వ్యవసాయాధికారులు పరిశీలించారు. గురువారం మండలంలోని డి. చెర్లోపల్లి గ్రామంలో మురళి సాగు చేసిన కళింగర తోటను హార్టికల్చర్ అధికారిణి అమరేశ్వరి. వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగార్జున పరిశీలించారు. రైతు సాగు చేసిన వివరాలు. పెట్టుబడులు తదితర విషయాలను గ్రామ సర్పంచి గుజ్జల రమాదేవిని, ఇతర రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వారు తెలిపారు.

టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తి చేయండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వైసీపీ ప్రభుత్వ నిర్వాహకం వలన 2018 టిడిపి హయంలో మంజూరైన టిడ్కో గృహ నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని , ఈ ప్రభుత్వంలోనైనా వాటిని పూర్తి చేయాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. ఈ మేరకు ఆమె గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ పుట్టపర్తిలోని టిడ్కో గృహాల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో 16.35 ఎకరాలలో 1243 టిడ్కో గృహాలను మంజూరు చేశారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 811 గృహాలను రద్దుచేసిందని వీటిలో 432 గృహాలను కట్టిస్తామని లబ్ధిదారులకు హామీ ఇచ్చిందని చెప్పారు. అందులో కేటగిరి వన్ కింద 80 శాతం కేటగిరి టు కింద 5శాతం, కేటగిరి 3క్రింద 20 శాతం పనులు పూర్తి చేసుకున్నాయని తెలిపారు. అయితే గృహ నిర్మాణం కోసం చాలా మంది లబ్ధిదారులు కట్టిన డిపాజిట్ల డబ్బులు కూడా వెనక్కి ఇవ్వలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో టిడిపి హయాంలో మంజూరైన వాటిలో వైసిపి ప్రభుత్వం 811 గృహాలను రద్దు చేసిందని వాటికి ఈ ప్రభుత్వం రీటెండర్లు నిర్వహించి తిరిగి కట్టించే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. వైసిపి ప్రభుత్వ మోసపూరిత వాగ్దాన నిర్వాహకం వల్ల సుమారు 6వేల కుటుంబాలు ప్రభుత్వానికి కట్టిన డిపాజిట్లు తిరిగి రాక పోవడమే కాకుండా ఇల్లు వారి పేరుపై మంజూరు కావడం వల్ల బ్యాంకు వాటికి ఇచ్చిన రుణాలు కట్టలేక పోతున్నారన్నారు. అలాంటి వారిని ఈ ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పురపాలక శాఖ మంత్రి నారాయణను కోరారు. ఈ విషయంపై మంత్రి నారాయణ స్పందిస్తూ ప్రభుత్వం తప్పకుండా టిట్కో ఇళ్లను పూర్తి చేసి అర్హులైన ప్రజలకు అందజేస్తుందన్ని హామీ ఇచ్చారు. ఈ విషయంపై సిఎంతో చర్చించి న్యాయం చేస్తామని చెప్పారు.



అసెంబ్లీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నాటుసారా నిర్మూలనకు నడుంబిగిద్దాం


ప్రజాశక్తి - కదిరి టౌన్

సారాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య పిలుపు ఇచ్చారు.గురువారం కదిరి రూరల్ మండలం బత్తలపల్లి తండా, కట్ల తండా, బాలప్పగారిపల్లి తండాలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలలో నాగమద్దయ్యతో పాటు ఆర్డీవో వివిఎస్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా వల్ల సమాజంలో చెడు ప్రభావాలు ఉత్పన్నవుతాయన్నారు. నాటుసారా తాగడం వలన ఆనారోగ్యానికి గురవుతారన్నారు. అనంతరం ప్రజల చేత నాటు సారా నిర్మూలనపై పతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ గోవింద నాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు, స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ శ్రీధర్, ఎస్ఐ దత్తాత్రేయ, క్సైజ్ సిబ్బంది, ఫారెస్ట్ బీట్ అధికారి, గ్రామ మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పన్ను చెల్లిస్తే సన్మానం.. లేకపోతే జప్తు..!

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా అధిక మొత్తంలో పన్నులు చెల్లించే వారందరూ సకాలంలో పన్నులు చెల్లిస్తే వారందరికీ సన్మానం చేస్తామని పన్నులు చెల్లించకుండా మొండికేసే వారి ఆస్తులను జప్తు చేస్తామనిమున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలో రాజశేఖర్ రెడ్డి, గంగ రత్నమ్మ లకు సంబంధించిన ఇంటి పన్ను రూ. 93.697 లను పురపాలక సంఘ కార్యాలయానికి వచ్చి మునిసిపల్ కమిషనర్‌కు చెక్కు రూపంలో అందించారు. వారిని కమిషనర్ సన్మానించారు. పట్టణ వాసులందరూ సకాలంలో పన్ను చెల్లించి, పట్టణ అభివద్ధికి దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారిని అలివేలమ్మ, రెవిన్యూ అధికారిని విజయభారతి, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్లు రాము, జకావుల్లా, రామాంజనేయులు, టెక్నికల్ అధికారి బండి ఆనంద్ రాజు తదితరులు పాల్గొన్నారు.



పన్ను చెల్లించిన గంగరత్నమ్మను సన్మానిస్తున్న కమిషనర్ సంగం శ్రీనివాసులు

అంతరాయం లేని ఫైబర్ నెట్ ప్రసారాలు సాగించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఏపీ ఫైబర్ నెట్ ప్రసారాలలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక కేబుల్ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో కేబుల్ ఆపరేటర్ల ప్రతినిధుల సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడారు. ప్రతిరోజూ గంటల కొద్దీ సిగ్నల్స్ ఆగి పోతుండడంతో వినియోగదారులు తమను వివిధ రకాలుగా నిందిస్తున్నారని వాపోయారు. ప్రతి ఒక్కరికి ఇంటర్నెట్ తక్కువ ధరకు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ప్రసారాల్లో జరిగే అంతరాయాలు తూట్లు పొడుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హెచ్‌సిఎ ఏపీ ఫైబర్ నెట్ అధ్యక్షులు టిఎన్ వెంకటేశులు, ప్రతినిధులు ఖలీల్ ,శంకర్ లాల్, గోపాల్, అశోక్, మోహన్, టెక్నీషియన్ శివ, మోతుకపపల్లి శంకరప్ప, మహేష్ , ఇర్ఫాన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యునెస్కో గుర్తింపు కోసం ప్రాథమిక నివేదిక

లేపాక్షి : లేపాక్షిలోని వీరభద్ర ఆలయ సముదాయానికి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు తెచ్చేందుకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని పర్యాటక నిపుణుడు, చరిత్రకారుడు మైనా స్వామి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రాథమిక నివేదిక సమర్పించారు. గురువారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసిన చరిత్రకారుడు కేంద్ర ప్రభుత్వం ద్వారా పారిస్‌లోని యునెస్కోతో సంప్రదింపులు ప్రారంభించడానికి నిపుణుల కమిటీని నియమించాలని అభ్యర్థించారు. వీరభద్ర స్వామి కుడ్యచిత్రం ఆసియాలోనే అతి పెద్దదన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఏకశిలా ఎద్దు (నంది విగ్రహం), ఎత్తైన నాగలింగం, నాట్య మండపంలోని నిలువు శిల్పాలు తదితర వివరాలను ఛాయాచిత్రాలతో పాటు ప్రాథమిక నివేదికలో పొందుపరిచారు. లేపాక్షి ఆలయ సముదాయానికి యునెస్కో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఈసందర్భంగా మైనాస్వామి వివరించారు.

మహిళలు సంఘటితం కావాలి



చిన్నారులతో ఎస్పీ రత్న



ఎస్పీ రత్నను సన్మానిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-హిందూపురం

మహిళలందరూ సంఘటితం అయితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, సమాజంలో మహిళ అబల కాదు సబల అని నిరూపించుకునేందుకు ప్రతి మహిళ కృషి చేయాలని, మహిళలు సమస్యలపై అవగాహన పెంచుకొని వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని జిల్లా ఎస్పీ వి. రత్న హిందూపురం జూనియర్ సివిల్ జడ్జ్ లలిత లక్ష్మీ హారిక కోట పేర్కొన్నారు. గురువారం హిందూపురం సమీపంలోని అప్పలకుంట క్రాస్ వద్ద ఉన్న కన్వెన్షన్ హాల్లో డీఎస్పీ కేవీ మహేష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీతో పాటు, జూనియర్ సివిల్ జడ్జి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మహిళలకు పురుషులతో పాటు సమాన హక్కులు కల్పించిందన్నారు. నేటి సమాజంలో మహిళలు ఇంటా, బయట అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారన్నారన్నారు. మహిళా సాధికారత, చైతన్యంతోనే మహిళా లోకం తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి వీలవుతుందన్నారు. ఉద్యోగాలు చేస్తున్న మహిళలతో సమానంగా గృహిణి పాత్ర కూడా కీలకమైనదన్నారు. కుటుంబం చాలా శక్తివంతమైనదని దానిని కాపాడుకోవాలని అన్నారు. పేరులోనే సత్యాన్ని దాచుకున్న జిల్లా సత్యసాయి జిల్లా అని అలాంటి జిల్లాలో నేరాలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్య సాయి జిల్లాను నేర రహిత జిల్లాగా మారుద్దామని పిలుపునిచ్చారు. ఇదివల ముఖ్య మంత్రి చంద్రబాబు శక్తి యాప్ ను ఆవిష్కరించారని మహిళలు బాలికలు తమ మొబైల్ ఫోన్లలో శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆపద సమయాల్లో శక్తి టీం సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను రక్షించే అవకాశం ఉందన్నారు. కొంతమంది మహిళలు రకరకాల ఆకర్షణలకు లోనై కుటుంబాలను భర్త పిల్లలను వదిలేసి తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులను కల్పించిందన్నారు. మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు నివారించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూనియర్ సివిల్ జడ్జి లలిత లక్ష్మి హారిక కోట మాట్లాడుతూ పనిచేసే ప్రాంతంలో మహిళలు జాగ్రత్తగా ఉండాలని, నేడు చట్టాలు మహిళలకు అనుకూలంగా ఉన్నాయని వాటిపై అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల్లో చిన్నప్పటి నుండి ధైర్యాన్ని నూరిపోస్తూ ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలన్నారు. దేశ ఆర్థిక అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని, ఓవైపు కుటుంబాన్ని చూసుకుంటూ మరోవైపు సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని అన్నారు. అదేవిధంగా మహిళలు పనిచేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపులు ఉంటే వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో సమాజ అభివృద్ధికి సహకారం అందిస్తున్న పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ శాంత, డాక్టర్ షర్మిళా బేగం, డిఎస్పీ వీకే మహేష్, సిఐలు అబ్దుల్ కరీం, ఆంజినేయులు, జనార్ధన్, ఎస్ఐలు, మెప్మా డిసిఎం గంగులయ్యతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.